


# న్యాయం కనబడుటలేదు

**ప్రఫుల్లచంద్ర**

అది చిన్న గ్రామమే అయినా, ఆర్. టి. సి. బస్సులకు ముఖ్య కూడలి. ఇటు విశాఖ, అటు విజయవాడ వెళ్ళే బస్సులన్నీ ఆ గ్రామం మీదుగా వెళ్తాయి.

చిన్న గ్రామం కాబట్టి అధికారుల దృష్టి దానిమీద పడలేదు. బస్సు స్టేషన్ కాదు కదా, షెల్టర్ కూడా లేదు. కొట్లముందు, చెట్లకింద ప్రయాణీకులు పడిగాపులు పడుతూ వుంటారు. డబ్బున్న మారాజులు హోటళ్లలో కూచుంటారు.

చెట్టు కింద పెళ్లి బృందం వుంది. క్రితం రాత్రే పెళ్లి జరిగింది. నూతన దంపతులతో సహా మొత్తం వాళ్లు యిరవైమంది. అక్కడికి ముప్పై ఐదు కి. మీ. దూరంలో గల పట్నంలో రైలెక్కి స్వగ్రామం వెళ్లాలి వాళ్ళు. పట్నంలో రైలు సరిగా రెండు గంటలకు. అప్పుడే పన్నెండు గంటలయింది. పట్నానికి సరిగా గంట ప్రయాణం. అరగంట క్రితం వచ్చిన బస్సులో వాళ్లు ఎక్కలేక పోయారు. మరో బస్సు ఎప్పుడు వస్తుందో...

కొద్దిదూరంలో వున్న మెటడర్ వాన్ డ్రైవర్ రెట్టింపు చార్జి అడగడంవల్ల బస్సులోనే వెళ్లడానికి నిర్ణయించుకున్నారు వాళ్ళు.

కిళ్లీకొట్టు నీడలో తల దాచుకొని ఆలోచిస్తున్నాడు "న్యాయం". అతని అసలుపేరు న్యాయపతి సత్యమూర్తి. పేరుకు తగినట్టే అతగాడు ప్రతి విషయంలోనూ తల దూర్చి "ఇది న్యాయం కాదు" అని అడ్డు తగులుతూ గ్రామస్తులకు తలనొప్పిగా తయారైనాడు. అతడు పని చేసే స్కూలులో సరేసరి. ఆరోక్లాసు పిల్లలు చాటుగా "న్యాయం గారు వస్తున్నారు రోయ్" అని అరుస్తారు. పదోతరగతి పిల్లలయితే మరీ గౌరవం లేకుండా "న్యాయంగాడు" అంటారు.

చివరికి అతడు పెళ్ళానికీ లోకువ అయిపోయాడు. కట్నం లేకుండా పెళ్లి చేసుకున్నాడన్న కృతజ్ఞత అయినా లేకుండా ఆమె "అయ్యా న్యాయంగారూ! మీకో నమస్కారం" అని అతనిని హేళన చేయడానికి కారణాలు లేకపోలేదు.

ఆయనతో సినిమాకు వెళ్తే — అదో సమస్య. రిక్షావాడు రూపాయి అడిగితే, ఆయన "అది న్యాయం కాదు, అర్ధరూపాయిస్తా" నంటాడు. బేరం తెగదు. చివరకు నడిచి వెళ్లాల్సి వస్తుంది. తీరా హాలువద్దకు వెళ్తే అక్కడ మరో సమస్య. "టిక్కెట్ మీద రేటు రెండు రూపాయిల ముప్ఫై మూడు పైసలే వుంది. అంతే యిస్తాను" అంటాడాయన.

"రెండు రూపాయిల ముప్ఫై అయిదు పైసలు" ఇమ్మంటాడు బుకింగ్‌గుమాస్తా. ఆ రెండు పైసల కోసం వాదన తారస్థాయికి పోయి, సినిమా చూడకుండా తిరిగి వచ్చిన సందర్భాలున్నాయి.

షాపింగ్‌కు వెళ్తే—"ఇది న్యాయం కాదు, ఈ వస్తువు వెల అంత వుండదు" అని బేరం మొదలు పెడతాడు చివరకు షాపు వాళ్ళు విసిగిపోయి "పోవయ్యా, పెద్ద కొనవచ్చావ్ !" అని అవమానిస్తారు

ఇక ఆయనతో షాపింగ్‌కు గాని సినిమాకు గాని వెళ్లకూడదని నిర్ణయించుకుంది భార్య. అప్పుడప్పుడు అవమానించడమూ మొదలు పెట్టింది.

చివరకు అతనికి ఇహలోక నరకం అయింది. అతడంటే స్కూలు పిల్లలకు గౌరవం లేదు. గ్రామస్తు లందరూ అతనిని గేలి చేయడమే.

ఇక భరించలేని "న్యాయం" రోడ్డున పడ్డాడు. స్వగ్రామం విడచి, గమ్యం తెలియని బాటసారిలా మూడురోజులు తిరిగాడు. ఇప్పుడు కిళ్లీకొట్టు నీడన నిలిచి పెళ్ళి బృందం వైపు దృష్టి సారించాడు.

అంత దూరంలో మెటడర్ వాన్‌లో కూచుని పెళ్లి బృందం వైపు చూస్తూ ఆలోచిస్తున్నాడు పార్వతీశం. అతడావాన్ కొని ఒక సంవత్సరం అయింది. ఆర్.టి.సి. వాళ్ల ధర్మమా అని అప్పటికే అతని పెట్టుబడి వచ్చేసింది. ఇంతకు ముందు రాములు అని ఒక డ్రైవర్ వుండేవాడు. కాని అతడు సొమ్ము కాజేస్తున్నట్టు అనుమానం కలిగి అతనిని పీకేసి, బండిని తనే స్వయంగా నడుపుకుంటున్నాడు పార్వతీశం — తనకు డ్రైవింగ్ లైసెన్సు లేకపోయినా, రోజుకు నికరంగా రెండు వందలు మిగులుతోంది. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే — అంతా డబ్బే!

పార్వతీశం వాచీ చూసుకున్నాడు ... పన్నెండున్నర ... మరో పావుగంటలో బస్సు వస్తుంది. ఈ లోగా ఆ పెళ్లివారి బేరం కొట్టేయాలి — అనుకొని వాళ్ళ వైపు నడిచాడు.

"ఏమండీ ! మీరు పట్నం వస్తున్నారా? లేదా ? ట్రెయిన్ అందుకోవాలంటే మనం వెంటనే బయలుదేరాలి. బస్సు మరో అరగంటకు గాని లేదు. మీరు బస్సులో బయలుదేరితే ట్రెయిన్ అందదు."

వాళ్ళు కాసేపు ఆలోచించి బిల బిల వాన్ ఎక్కేసారు అంత దూరంలో తెలిసిన ముఖం కనిపించడంతో, ముఖం చాటేసి తనూ వాన్ ఎక్కేసాడు "న్యాయం". వీళ్ళను చూసి మరికొందరు ... సుమారు ముప్ఫైమంది గోడౌన్‌లో బస్తాల్లా కూరుకుపోయారు. వాన్ ఒక మైలు వెళ్ళిందో లేదో — వెనుక నుండి బస్సు వచ్చేసింది. బస్సుని దాటించడానికి వేగం పెంచాడు పార్వతీశం.

వాహనానికీ, డ్రైవర్‌కి ఒక విచిత్ర సంబంధం వుంది. డ్రైవర్ సమర్థుడైతే వాహనం అతని అదుపులో ఉంటుంది. అసమర్థుడైతే వాహనమే అతనిని ఆడిస్తుంది. అలాంటి డ్రైవర్ ఏమ్పుడేం చేస్తాడో ఎవరూ చెప్పలేరు. బళ్ళు,మనుషులు అడ్డు వస్తే సహించలేడు. తనకంటే ముందుగా మరో వాహనం వెళ్ళడానికి వీల్లేదు. వెనుకనుండి వస్తున్న వాహనాలకు దారి వదలడం అవమానం.


ఇప్పుడు ఆ మెటడర్ వాన్- పార్వతీశాన్ని కంట్రోల్ చేస్తున్నది! అరవై కిలోమీటర్ల వేగం అందుకుంది ఆదే వైపుపోతున్న బండిని దాటడానికి పార్వతీశం వాన్‌ని హఠాత్తుగా కుడి వైపు 'కోయగా', ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనబోయి సడన్‌గా ఎడమవైపుకి తప్పించాడు. వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పింది. ఈ కుడి ఎడమల కుదుపుకి గుండె లాగిపోయినా, ప్రమాదం తప్పినందుకు అందరూ పార్వతీశాన్ని మెచ్చుకున్నారు. ఏదో సినిమా ఛేజ్ సీనులో పాల్గొన్నట్టు థ్రిల్లింగ్‌గా వుంది ప్రయాణీకులకు. నెమ్మదిగాపోనిమ్మని సణుగుతున్న 'న్యాయాన్ని' చూసి హేళనగా నవ్వుకున్నారు కొందరు.

తన ప్రతిభను నవ వధువు గుర్తించిందా, లేదాని వెనక్కి తిరిగి చూశాడు పార్వతీశం. వెలిగిపోతున్న పెద్ద కళ్లతో అతనినే చూస్తోందామె. అతని గుండె సగర్వంగా మూలిగింది. రోడ్డుమీదకు దృష్టి మరల్చాడు.

కాని...

అప్పటికే అరక్షణం ఆలస్యం అయింది. చెట్టాపట్టాలేసుకుని సినిమాకు వెళ్తున్న ఇద్దరు బాలుర మధ్య నుండి దూసుకుపోయింది వాన్. మృత్యులోయలోనికి కూలిపోతూ దిక్కుతోచని భయంతో ఆ అర్భకులు చేస్తున్న ఆర్తనాదానికి ప్రయాణీకుల వళ్ళు జలదరించి గుండెలాగిపోయి, హఠాత్తుగా రాక్షస నిశ్శబ్దం అలముకుంది పార్వతీశం మెదడు దిగ్భ్రమతో శూన్యం అయిపోంది. శరీరంలోని జీవశక్తి ఆవిరి అయిపోయింది. కాళ్ళు తేలిపోతున్నాయి. చేతులు పట్టు తప్పాయి.

మరుక్షణంలో వాన్— రోడ్డు ప్రక్కనే వున్న పంట కాలువ వైపు దూసుకుపోతూ వుండగా—



# న్యాయం కనబడుటలేదు

పార్వతీశం హఠాత్తుగా జాగ్రతం అయాడు. ఏం చేస్తున్నాడో తెలియకుండానే వాన్‌లోంచి బయటకు దూకేశాడు.

మరుక్షణంలో వ్యాన్ కాలువలోకి చొచ్చుకు పోయింది. దాని మూతి బురదలో కూరుకుపోగా వెనుక భాగం పైకి లేచింది. పైకి లేచిన ఆ భాగం ఒక నిముషం మాత్రమే కనిపించింది. ఆ నిముషం తరువాత కాలువలో అలలు, బుడగలు తప్ప మరేమీ కనిపించలేదు. మృత్యు పంజరంలో చిక్కుకున్న ఆ అభాగ్యుల ఆక్రందన కాలువ గర్భంలో కలిసిపోయింది.

మట్టూ మూగుతున్న జనాన్ని చూసి పరుగు ప్రారంభించాడు పార్వతీశం.

* * *

"మెటడర్ వాన్" కాలువలో కూరుకు పోగా నూతన వధూవరులతో సహా పదిమంది దుర్మరణం— మరో యిరవై మందికి గాయాలు— డ్రైవర్ పరారీ—" మర్నాటి దినపత్రికలన్నీ సంచలన వార్తను వివరాలతో, ఫొటోలతో ప్రచురించాయి.

* * *

"ఇదిగో, రాములూ, అప్పుడేదో కోపంలో నిన్ను ఉద్యోగంలోంచి పీకేసాను. అదంతా మరచిపో. ప్రమాదం జరిగినప్పుడు వాన్‌ని నీవే డ్రైవ్ చేస్తున్నట్టు పోలీసులతో చెప్పు. నీకు జైలుశిక్ష ఒక సంవత్సరం మించకుండా నేను చూస్తాను. జైలు నుండి రాగానే రెట్టింపు జీతంతో నీ వుద్యోగం నీకిస్తా. నీవు జైలులో ఉన్నంతకాలం నీ భార్యాబిడ్డల పోషణకోసం నెలనెలా నీవు సంపాదిస్తున్నంత జీతం యిస్తా. పైగా ఐదువేలు యిస్తా" గంభీరంగా ఉండడాన్కి ప్రయత్నిస్తున్నా, పార్వతీశం స్వరంలో దీనత్వం వినిపిస్తోంది. పులిలా గాండ్రించే అతడిప్పుడు కబేళాలోని మేకలా మేమే అంటున్నాడు. జాలి వేసింది రాములికి. "డబ్బున్న మారాజులికి పరువు ప్రతిష్టలంటే ఎంత మోజు! డబ్బుతోనే వాటిని నిలుపుకోవాలనుకుంటారు" అనుకున్నాడు. తాను కొస్త బిగిస్తే మరింత డబ్బు కురుస్తుంది అని భావించాడు. పార్వతీశాన్ని మరికొంత ఏడిపించి, మరింత బతిమాలించుకొని పదివేలకు బేరం కుదుర్చుకున్నాడు. పార్వతీశం వెంటనే పదివేలు యిచ్చేసాడు అతని భార్యా బిడ్డలకు నెలనెలా మూడొందలు యిస్తానన్నాడు. మొదటి నెల బాపతు మూడొందలూ అప్పుడే యిచ్చేసాడు.

ఆ రోజంతా కుటుంబంతో జల్సాచేసాడు రాములు మర్నాడు భార్యాబిడ్డల్ని మామగారి ఊరికి బస్సెక్కించి, పోలీసులకు లొంగిపోయాడు. కస్టడీ గదిలోకి హీరోలా సగర్వంగా ప్రవేశించాడు.

కాని...

ఆ రాత్రే. మామగారింట్లో దొంగలు పడి తన భార్యనుండి పదివేలూ కాజేసారనీ, ఆ పదివేలలో ఎనిమిదివేలు మళ్లీ పార్వతీశాన్నే చేరుకున్నాయనీ, మరి కొద్ది కాలానికి పార్వతీశం తన వాన్‌ని అమ్మివేశాడనీ, అందువల్ల తనకి మళ్లీ డ్రైవర్ ఉద్యోగం దొరికే అవకాశం లేదనీ...

కస్టడీ గదిలోకి సగర్వంగా ప్రవేశించి బంగారు భవిష్యత్తు గురించి కలలుకంటున్న అభాగ్యుడు రాములికి తెలియదు.

* * *

ఒక దినపత్రికలో... ఒక ఫోటో, దాని కింద ఒక ప్రకటన...

## కనబడుటలేదు



"పై ఫొటోలోని 'న్యాయం' అని పిలువబడే న్యాయపతి సత్యమూర్తి కనబడుటలేదు. ఈ న్యాయాన్ని పట్టి తెచ్చిన వారికీ లేదా ఆచూకీ తెలియజేసిన వారికి నూటపదహార్లు బహుమతి. బాబూ, న్యాయం! నీవు యిల్లు వదిలి వెళ్లి పోవుట వలన నీ తలిదండ్రులు, భార్య బెంగ పెట్టుకొని మంచం పట్టారు. నీవు ఎక్కడ వున్నా వెంటనే యింటికి తిరిగి రావలసినది."

* * *

ఈ ప్రకటన చదవడాన్కి— ఈలోకంలో న్యాయం ఉంటే కదా ?!


మీ గృహాలంకరణకు కావలసిన
ఫర్నిషింగ్స్, డోర్ కర్టెన్స్
బెడ్ షీట్స్, టవల్స్
కార్పెట్ కవర్స్, సోఫా కవర్స్‌కు
దర్శించండి
ఫోన్: 73708
డెకార్స్
V.H.R కాంప్లెక్స్, బీసెంట్ రోడ్
విజయవాడ-2.
PAPUR

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్.
వివాహము వాయిదా వేయవవసరము లేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్కలనములకు ఆయుర్వేద చికిత్స.
పోస్టుద్వారా చికిత్స కలదు.



రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి.
ఫోన్ : 700, 1010.

చర్మ రోగం పోకిందా?



ఉపశమనం కల్గించే లిచెన్‌సా స్కిన్ ఆయింటు మెంటు నిరపాయకరంగా, శీఘ్ర నివారణ కలిగిస్తుంది.

రుజువు చేయబడిన 6 మందులుతో కూడిన నిరపాయకరమగు నాజూకైన మలాము అమోఘంగా పనిచేస్తుంది చర్మరోగాలకు. కోతలకు, పుండ్లకు...మరియు మొటిమలకు చమటకాయలకు పొడుపుడుకాయలకు!

చర్మరోగాలు కన్పించీ కన్పించడంతోటే నిరపాయకరమైన శీఘ్ర నివారణకు లిచెన్‌సా వెంటనే ఉపయోగించండి.

లిచెన్‌సా
స్కిన్ ఆయింటు మెంటు
7560 TG